దేశానికే గర్వకారణం స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్


రాజవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు


జంగారెడ్డిగూడెంలో సామాజిక సమతా సంకల్ప ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అంబేడ్కర్ ఆశయాలను సాకారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశానికే గర్వకారణంగా స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ నిర్మాణం చేపట్టిందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. గురువారం రాజవరం గ్రామంలో భారతరత్న డా.బీఆర్ అంబేడ్కర్, మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రపంచంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని, ఈ కార్యక్రమానికి అంబేడ్కర్ అభిమానులు హాజరు కావాల్సిందిగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అంబేడ్కర్ జిల్లాను ఏర్పాటు చేసిన ఘనత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి దక్కగా, ఇప్పుడు అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహంతో అంబేడ్కర్ ఆశయసాధన ప్రభుత్వంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలిచిందని అన్నారు. అనంతరం విద్యుత్ షాక్‌కి గురై ప్రాణాలు కోల్పోయిన కోన సురేష్ కుటుంబాన్ని పరామర్శించి పార్టీ తరుపున కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు అనంతల సుబ్బారావు, శ్రీరంగనిలయం కాశీ విశ్వనాథం, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, దుగ్గిరాల చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

అసమానతలను రూపుమాపేందుకు అంబేడ్కర్ ఎనలేని కృషి

జంగారెడ్డిగూడెం: సామాజిక రుగ్మతలు రూపుమాపేందుకు రాజ్యాంగం అనే ఒక ఆయుధాన్ని మనకిచ్చిన గొప్ప అభ్యుదయవాది, మానవతామూర్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, ట్రైనీ డీఎస్పీ బి.విద్య, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలో గురువారం సామాజిక సమత సంకల్ప ర్యాలీ భారీఎత్తున నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందు దేశంలో నెలకొన్న అస్పృశ్యత, అంటరానితనం, నిరక్ష్యరాస్యత, అసమానతలు వంటి అనేక సాంఘిక రుగ్మతలు చూసిన అంబేడ్కర్ వాటన్నింటిని రూపుమాపేందుకు తన వంతు కృషిచేసి రాజ్యాంగ రూపకల్పన చేశారన్నారు. అయితే ఇంకా ఆయా వర్గాల ప్రజలు వెనుకబాటుకు గురవుతూనే ఉండటం బాధాకరం అన్నారు. అంబేడ్కర్‌ను గుర్తు చేసుకోవడం ద్వారా ఆయన అందించిన రాజ్యాంగ స్ఫూర్తిని అలవాటు చేసుకుని సామాజిక సమతకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 19వ తేదీ విజయవాడలో 206 అడుగుల ఎత్తుగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతి వనం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్న నేపథ్యంలో ప్రజలను చైతన్య పరచడానికి ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. అలాగే పట్టణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలను సుందరీకరించినట్లు తెలిపారు. తొలుత మున్సిపల్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్, తహసీల్దార్ స్లీవజోజి, ఎంపీడీఓ ఎ.విజయ్‌ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, మున్సిపల్ కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, మెప్మా సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో పరిపాలన

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాబాసాహెబ్ డా.బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూ పరిపాలన సాగిస్తున్నారని జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు గుర్రాల రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ భావజాలంతో పరిపాలన సాగిస్తున్న, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయవాడ నడిబొడ్డున, దాదాపు రూ.400 కోట్లతో 20 ఎకరాల విశాల ప్రాంగణంలో 206 అడుగల ఎత్తు గల అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణం చేస్తుండడం దేశానికే తలమానికం అని, నేడు సీఎం జగన్ ప్రారంభించబోతున్న ఈ కార్యక్రమానికి కుల, మత, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

మైక్‌సెట్ బహూకరణ


రాజీవ్‌నగర్‌లోని కోదండ రామాలయానికి మైక్‌సెట్ బహూకరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రాజీవ్ నగర్‌లో గల శ్రీ కోదండ రామాలయానికి వంకదారి రామకృష్ణ మైక్‌సెట్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ ఆలయం శోభాయమానంగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. దాత రామకృష్ణను విశ్వహిందూపరిషత్ సభ్యులు, ఆలయకమిటీ సత్కరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ, బీకే విశ్వనాథ్, భాస్కర్, కె.దుర్గాప్రసాద్, బట్టు భాస్కర్, బట్టు హరి, కుమారి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం చరిత్రాత్మక ఘట్టం

బుట్టాయగూడెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో విజయవాడలో స్మృతివనం పేరుతో 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చరిత్రాత్మక ఘట్టమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ విగ్రహం ప్రపంచంలోనే పెద్ద అంబేడ్కర్ విగ్రహం అని అన్నారు. అలాగే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని కూడా సీఎం వైఎస్ జగన్ పండుగ వాతావరణంలో జరిగేలా ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అంబేద్కరిస్టులు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించి పోలవరం నియోజకవర్గంలోని మండలాల నుంచి సుమారు 33 వాహనాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

సీఎం జగన్ చిత్తశుద్ధికి నిదర్శనం


స్టేట్ లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్

లింగపాలెం: విజయవాడలో ఈనెల 19వ తేదీన రూ 400 కోట్లతో అంబేడ్కర్ స్మృతి వనం, 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేయడం అంబేడ్కర్ పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమని స్టేట్ లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ అన్నారు. గురువారం ఆయన లింగపాలెంలో విలేకరులతో మాట్లాడుతూ విగ్రహావిష్కరణ కార్యక్రమం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖితమై గొప్పఖ్యాతి పొందుతుందన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందన్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సక్రమంగా ఓటర్ల నమోదు ప్రక్రియ

ఏలూరు రూరల్ : ఏలూరు నియోజకవర్గంలో ఓటర్లు నమోదు పక్రియ పక్కాగా నిర్వహించామని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. ఏలూరు కొత్తపేట 42 డివిజన్‌లో 79, 80, 82 పోలింగ్ కేంద్రాల్లో 50 మంది టీడీపీ సానుభూతి పరుల ఓట్లు తొలిగించారంటూ కొన్ని పత్రికల్లో వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆయన తెలిపారు. పైన పేర్కొన్న పోలింగ్ కేంద్రంలో చనిపోయిన వారి 13 ఓట్లను, ఎన్‌రోల్ అయిన 60 మంది డూప్లికేట్ ఓట్లు తొలిగించాలని ఎన్నికల సంఘానికి సిఫార్సు చేశామన్నారు. ఇతర పోలింగ్ కేంద్రాలకు లేదా నియోజకవర్గాలకు తమ ఓటు మార్పు కోరుతూ 84 దరఖాస్తులు వచ్చాయన్నారు. పైన పేర్కొన్న మూడు పోలింగ్ కేంద్రాల పరిధిలో వచ్చిన 157 (ఫారం-7) దరఖాస్తులను పరిశీలించి, పక్కా ఆధారాలు సేకరించామని వివరించారు. ఓట్లు తొలిగింపు, కొత్త ఓటర్ల గుర్తింపుపై బీఎల్‌ఓలపై ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం విధి, విధానాలు అనుసరించి, నియోజకవర్గం అంతటా నిష్పక్షపాతంగా ఓటర్ల నమోదు పక్రియ నిర్వహించామని వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నిడమర్రు: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిడమర్రు ఎస్సై ఆర్ శ్రీను తెలిపారు. గురువారం నిడమర్రు కూడలిలో వాహన తనఖీల్లో భాగంగా వేగంగా, లైసెన్స్ లేకుండా, ట్రిపుల్ రైడింగ్‌తో వెళ్లే పలువురు యువతను, విద్యార్థులను నిడమర్రు పోలీసులు ఆపి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, ఏదైనా యాక్సిడెంట్ చేస్తే ఎ-1 ముద్దాయిగా పోలీస్ కేసులో ఇరుక్కుంటారని, దీంతో ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం కోల్పోతారని వివరించారు.

లోపూడిలో కళ్లజోళ్ల పంపిణీ

లోపూడి(ముసునూరు): రాష్ట్ర ప్రభుత్వం దృష్టి లోపంతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి, నేత్ర వైద్య పరీక్షలు చేసి, వారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేయడం మహద్భాగ్యమని జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన అన్నారు. ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా లోపూడి సచివాలయం పరిధిలో నిర్వహించిన వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలు చేయించుకున్న 21 మందికి గురువారం సర్పంచ్ పేరం కృష్ణ కళ్లజోళ్లు అందజేశారు. నలుగురికి కంటి శస్త్ర చికిత్సలు చేయించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులపై ప్రణాళికలు తయారు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జి.శ్రీను

పోలవరం రూరల్: గ్రామ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులపై ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో జి.శ్రీను తెలిపారు. పోలవరం మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామపంచాయతీ పరిధిలోని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లకు పంచాయతీలో చేపట్టే అభివృద్ధి పనులపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలను గురువారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీల పరిధిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు 9 బృందాలను కేటాయించి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా దృష్టి కేంద్రీకరించి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు యు.రాజారావు, ఈవోపీఆర్‌డీ కె.శ్రీనివాసులు అభివృద్ధి పనులపై అవగాహన కల్పించారు.

విచ్చలవిడిగా పందుల సంచారం


చింతలపూడి పట్టణంలోని మసీదు వీధిలో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులు

చింతలపూడి: నగర పంచాయతీలో ప్రజలు విచ్చలవిడిగా సంచరిస్తున్న పందుల బెడదతో సతమతమవుతున్నారు. పట్టణం నడిబొడ్డునే పందుల పెంపకం కొనసాగుతున్నందున అవి స్వేచ్ఛగా రోడ్లపైనే సంచరిస్తున్నాయి. పట్టణంలోని వీధులు, పేటలు ఇలా అన్నిచోట్ల ఇవి లేని ప్రదేశం లేదు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రి, మెయిన్‌బజారు, ముస్లిం వీధి, జీబీజీ రోడ్డు, పాత బస్టాండ్, మారుతీనగర్, గణేష్ కాలని, గాంధీ నగర్, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ తదితర ప్రాంతాల్లో పందులు విచ్చలవిడిగా సంచరిస్తూ వాహనదారులకు, గృహిణులకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలుగచేస్తున్నాయి. అంటు వ్యాధులకు కారణమవ్వడమే కాక, అనేక సందర్భాల్లో ఇవి పిల్లలను గాయపరిచిన సంఘటనలు లేకపోలేదు. ముఖ్యంగా వీధుల్లోని డ్రెయినేజీల్లో పందులు నివాసం ఏర్పాటు చేసుకొని దుర్వాసన వెదజల్లుతున్నాయి. స్థానిక నగర పంచాయితీ అధికారులు అనేక పర్యాయాలు వీటి యజమానులను సమావేశపరిచి, నోటీసులు జారి చేసి హెచ్చరించినా ఫలితం ఉండటం లేదు. రాత్రి వేళల్లో పందుల యజమానులు పందులను గుంపులుగా తోలుకువచ్చి మారుతీనగర్, ఎస్‌వీఎస్ కాలనీ, మోడల్ కాలనీ ప్రాంతాల్లో విడిచి పెడుతున్నారని వాపోతున్నారు. పందుల యజమానులపై చర్యలు తీసుకుని ఊరికి దూరంగా పందుల పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


రమణక్కపేట హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రమణక్కపేట(ముసునూరు): కలసి చదువుకుని, స్నేహ పూర్వకంగా మెలిగి, నేడు వివిధ స్థాయిల్లో స్థిరపడిన మిత్రులంతా తమ అల్లర్లు, చిలిపి చేష్టలు, స్నేహ బంధాన్ని, ఆత్మీయతలను నెమరు వేసుకున్నారు. దీనికి రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. ప్రస్తుత హెచ్ఎం రామకృష్ణ అధ్యక్షతన 1998-1999వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పాఠశాల పూర్వ విద్యార్థులు తమ గురువులతో కలిసి గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి హెచ్ఎం కేవీఎస్ఆర్ ప్రసాదరావు మాట్లాడుతూ చిన్నతనంలో విద్య నేర్పిన గురువులు, సహచర విద్యార్థులను విద్యాలయానికి రప్పించి, తీయని జ్ఞాపకాలు నెమరు వేసుకోవడం ఆనంద దాయకమన్నారు. అలనాటి ఉపాధ్యాయులు 15 మంది, విద్యార్థులు 52 మంది హాజరుకావడం అరుదైన విశేషమన్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యాలయ సౌకర్యార్థం రూ.12 వేలు విలువైన ఐరన్ బీర్వాను హెచ్ఎంకు అందజేశారు.

పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం


ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీ వివేక్ ఠాకూర్, సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

ఆగిరిపల్లి: ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యాన పేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు రాజ్యసభ సభ్యుడు, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వివేక్ ఠాకూర్ తెలిపారు. గురువారం మండలంలోని ఈదర సచివాలయంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ శాఖల వారీగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఎంపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ వివేక్ ఠాకూర్ మాట్లాడుతూ దేశంలో ప్రధాని మోదీ కేంద్ర పథకాలను ప్రతి ఒక్కరికీ అందించాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టారని వివరించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పలువురు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఏలూరు జిల్లా పరిషత్ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, ఎంపీపీ గొళ్ల అనూష, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట, తహసీల్దార్ ఉదయ భాస్కర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, నియోజకవర్గ కన్వీనర్ జీఆర్‌కే రంగారావు, మండల అధ్యక్షుడు కొవ్వలి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత పూళ్ల జట్టు

భీమడోలు: ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్వార్టర్, సెమీ ఫైనల్ కబడ్డీ పోటీలు భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఉత్కంఠగా సాగాయి. మండల వ్యాప్తంగా ఉన్న 17 సచివాలయాల పరిధిలోని 14 కబడ్డీ టీంలు పాల్గొన్నాయి. యువ క్రీడాకారుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడలు దోహద పడతాయని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి పేర్కొన్నారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎంపీడీఓ, కోఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావులు గేమ్ నిబంధనలను వివరించారు. అనంతరం క్రీడాకారులు తమ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. ఫైనల్ కబడ్డీ మ్యాచ్‌లో ఆగడాలలంక టీంపై పూళ్ల టీం విజయం సాధించింది. క్రీడాకారులను ఎంపీడీఓ, ఎస్సై వై.సుధాకర్, పీడీలు అభినందించారు.

రెండోసారి జగన్ సీఎం కావడమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త విజయరాజు


ఎంపీపీ వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ ముఖ్యనేత వెంకటేశ్వరరావును కలిసిన విజయరాజు

లింగపాలెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడమే లక్ష్యంగా పనిచేస్తానని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. గురువారం ఆయన లింగపాలెం మండలంలోని నరసన్నపాలెం తదితర గ్రామాలలో పర్యటించి స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. నరసన్నపాలెం, కొత్తపల్లిలో ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి, పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, యలమంచి సత్యన్నారాయణ, కోటగిరి పాపారావు, గుర్రాల వెంకటేశ్వరరావు, ముత్యాల రాధకృష్ణ తదితరులను మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులను కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పార్టీ వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. విజయరాజు వెంట వైస్ ఎంపీపీ మట్టా సురేష్, పార్టీ మండల కన్వీనర్ కొఠారి మోహన్ తదితరులు ఉన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మి

లింగపాలెం: గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం అని ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బందితో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పంచాయతీలలో చేసే పనులు ఈగ్రామ స్వరాజ్ వెబ్‌సైట్‌లో పొందపర్చాలన్నారు. గ్రామాల్లో చేసే అభివృద్ధి పనులకు సంబంధించి ముందుగానే ప్రణాళిక తయారుచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్టా సురేష్, ఎంపీడీవో ఎస్.ఆశీర్వాదం, ఈవోపీఆర్‌డీ రత్నకుమార్, పీఆర్ ఏఈ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర నివేదికలను తయారుచేయాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ ఎం.శ్రీహరి

బుట్టాయగూడెం: పంచాయతీలు తమకు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం కోసం పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకోవాలని ఈఓపీఆర్‌డీ ఎం.శ్రీహరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఉపసర్పంచ్‌లు, గ్రేడ్-5 సెక్రటరీలు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు, ఎంపీటీసీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ పంచాయతీల్లో ఏటా గ్రామ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఇందుకు సంబంధించిన ప్రణాళికలు సమగ్రంగా సిద్ధం చేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా ఆయా గ్రామాల పరిధిలో చేపట్టే పనులపై కచ్చితమైన ప్రణాళికలు ఉండేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఏఓ టి.బేబీ సరోజిని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీ కృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ వి.రామానుజం, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

పెదపాడు: గౌడ సేవా సమితి ద్వారా ప్రతి నెలా రెండు గౌడ పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఏలూరు గౌడసేవాసమితి జనరల్ సెక్రటరీ న్యాయవాది, బైగాని రంగారావు తెలిపారు. గురువారం వేంపాడు గ్రామానికి చెందిన చిట్టిమాది సాయి ప్రసాద్ కిడ్నీ వ్యాధితో జనవరి 1న మరణించడంతో వారి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. దీంతో పాటు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గురై చికిత్స పొందుతున్న అమ్మపాలెం గ్రామానికి చెందిన బాలిన సురేష్‌కు రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ మార్గాని సురేష్ పరసా శ్రీనివాస్ పరసా నాగ శ్రీనివాసరావు, పరసా మోహన్ గౌడ్, నూతి రవిగౌడ్, సురగాని శ్రీనివాసరావు, వీరంకి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేకు ఏర్పాట్లు పూర్తి

నూజివీడు: నేటి నుంచి మండలం, పట్టణంలో నిర్వహించనున్న కులగణన సర్వేకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో వీఏ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ తెలిపారు. దీనిలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉండే సెక్రటరీలకు క్లస్టర్‌లను కేటాయించామని, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కులగణన సర్వే నిర్వహిస్తారన్నారు. తర్వాత సామాజిక, ఆర్థిక పరిస్థితులు అన్నింటిని నమోదు చేసుకుని యజమాని, వలంటీర్, సెక్రటరీలు ఈకేవైసీ చేస్తారని, అప్పుడే ఆ కుటుంబం కులగణన సర్వే పూర్తయినట్లన్నారు. కులగణనకు గానూ నూజివీడు మండలం వలంటీర్లు, సెక్రటరీలు కలిసి దాదాపు 650 మందిని నియమించామన్నారు. అలాగే ఐదుగురు మండల స్థాయి అధికారులను సూపర్‌వైజర్లుగా నియమించినట్లు వివరించారు. పట్టణంలో దాదాపు 400 మందిని కులగణన సర్వేకు నియమించామన్నారు. నేటి నుంచి జరిగే కులగణన సామాజిక ఆర్థిక స్థితి సర్వేకు ప్రజలందరూ సహకరించాలని, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు తోడ్పాటును అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ట్రక్కు పల్టీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

చాట్రాయి: జామాయిల్ ట్రక్కు పల్టీ కొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం రాత్రి జరిగింది. మండలంలోని జనార్దనవరం గ్రామం నుంచి చాట్రాయి వైపు వెళ్తున్న జామాయిల్ ట్రక్కు ప్రమాదవశాత్తూ చాట్రాయి ఊర చెరువు వద్ద పల్టీ కొట్టడంతో ట్రక్కుపైన ఉన్న ఆరుగొలనుపేట గ్రామానికి చెందిన బచ్చు శరత్ జామాయిల్ కర్రల అడుగు భాగాన పడిపోయాడు. స్థానికులు త్వరితగతిన మీద పడిన కర్రలను తొలగించి ట్రక్కుని తొలగించారు. బాధితుడికి తీవ్ర గాయాలు కావడంతో నూజివీడు ఆస్పత్రికి తరలించారు.

22వ తేదీన సెలవు దినంగా ప్రకటించాలి

జంగారెడ్డిగూడెం: సంక్రాంతి సెలవులను మూడు రోజులు పొడిగిస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకుందని, అయితే ఈనెల 22న ఆయోధ్యలో శ్రీరామచంద్రుని ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరుగుతున్న సోమవారం నాడు కూడా పాఠశాలలకు సెలవు ప్రకటించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 22న దేశంలో అతిపెద్ద పండుగ అయోధ్యలో శ్రీరామచంద్రుల వారి ప్రాణ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అద్భుతమైన కార్యక్రమంలో తల్లిదండ్రులతో పాటు పిల్లలు కూడా పాల్గొనేటువంటి అవకాశాన్ని కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ఆ రోజు సెలవు దినంగా ప్రకటించిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ కూడా ఈ నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

విజిలెన్స్ దాడులు


ముబారక్ ఖచ్చీ ధమ్ బిర్యానీ సెంటర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ముబారక్ ఖచ్చీ ధమ్ బిర్యానీ సెంటర్‌లో విజిలెన్స్ అధికారులు, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. బిర్యానీ సెంటర్‌లోని ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ దాడుల్లో ఆహార పదార్థాల తయారీ కోసం హెచ్‌పీ, భారత్ గ్యాస్ కంపెనీలకు చెందిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌లు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. రూ.61,120 విలువల గల 14కేజీల గ్యాస్ సిలిండర్‌లు -5, 5 కేజీల గ్యాస్ సిలిండర్‌లు 18 స్వాధీనం చేసుకుని బిర్యానీ సెంటర్ యజమానిపై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం 6(ఎ), 7(1) కేసులు నమోదుచేసినట్లు సీఎస్ డీటీ వైవీ లక్ష్మీకుమారి చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దాడి ఘటనలో భర్తపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: భార్యపై దాడి చేసి గాయపర్చిన ఘటనలో భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కేతవరం గ్రామానికి చెందిన బొర్ర గంగరాజు, చంద్రవతి భార్యాభర్తలు. ఈ నెల 16న వీరిద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకోగా, గంగరాజు కర్రతో భార్య చంద్రవతిని కొట్టాడు. కుటుంబసభ్యులు చంద్రవతిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గంగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ చోరీ

జంగారెడ్డిగూడెం: ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ చోరీ చేసిన ఘటనపై రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం పేరంపేటకు చెందిన పల్లి శ్రీనివాసరెడ్డికి వెంకటరామానుజపురంలో పొలం ఉంది. సదరు పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఈనెల 14వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగివైరు చోరీ చేశారు. ఈ ఘటనపై శ్రీనివాసరెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

కోడిపందేలపై దాడి

జంగారెడ్డిగూడెం: కోడిపందేలపై గురువారం జంగారెడ్డిగూడెం పోలీసులు దాడులు నిర్వహించారు. స్థానిక రాముడుకుంట చెరువు ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అతని వద్ద నుంచి రెండు కోళ్లు, 2 కోడికత్తులు, రూ. 110 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.